సాక్షి
చిత్తూరు
బుధవారం । 8 । అక్టోబర్ । 2025



పరిసరాల శుభ్రతపై అవగాహన

పరిసరాల శుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగా హన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. - 8లో



విచ్చలవిడిగా స్పిరిట్!

ఉమ్మడి చిత్తూరు జిల్లా మీదుగా స్పిరిట్ విచ్చ లవిడిగా తరలుతోంది. డీజిల్ లారీల ద్వారా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. - 8లో



వాల్మీకి సేవలు మరువలేం

వాల్మీకి మహర్షి సేవలు మరువలేమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 76,773 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,100 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

కస్టడీ కోరుతూ పిటిషన్

చిత్తూరు అర్బన్: చిత్తూరులో మైనర్ బాలికపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డ ముగ్గురు నిందితులను కస్టడీకి అనుమతించాలని కోరుతూ పోలీసులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు చిత్తూరులోని మూడో అదనపు మునిసిఫ్ మేజిస్ట్రేట్ న్యాయ స్థానంలో తాలూక పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో కూటమి పార్టీకి చెందిన మహేష్, కిషోర్, హేమంత్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసి, చిత్తూరు జిల్లా జైలుకు తరలించిన విషయం తెలిసిందే. నిందితుల మొబైల్ ఫోన్లలో పలువురు దంపతులు, యువతీ యవకుల ఏకాంత వీడియోలు లభించడంతో వీళ్లను విచారించాల్సి ఉందని పోలీసులు పిటిషన్ వేశారు.

ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి



ఈక్రాప్‌బుకింగ్‌ను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈక్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. చిత్తూరు మండలం, చెర్లోపల్లి ప్రాంతంలో జరుగుతున్న ఈక్రాప్ బుకింగ్ నమోదును ఆయన మంగళవారం పరిశీలించారు. తొలుత వేరుశనగ పంట సాగును పరిశీలించారు. పంటసాగు, దిగుబడి తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ శాఖ సిబ్బంది చేపడుతున్న ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించి త్వరితగతినం పూర్తయ్యేలా చూడాలని ఆయన ఆదేశించారు. మండల వ్యవసాయశాఖ అధికారి వేణు తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : నేషనల్ యూత్ వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన శాఖ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి నేషనల్ యూత్ వలంటీర్లుగా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి గల యువతకు అవకాశం కల్పించారన్నారు. ఏడాది పాటు సమాజసేవ నిమిత్తం వలంటీర్‌లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు అర్హులన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికయ్యే వలంటీర్‌లకు నెలకు రూ.5 వేలు స్టైఫండ్ ఇస్తారన్నారు. కనీసం 10వ తరగతి విద్యార్హత ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9908127829లో సంప్రదించాలని ఆయన కోరారు.

వెబ్‌కౌన్సెలింగ్‌కు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మెగా డీఎస్సీలో అర్హత సాధించిన నూతన టీచర్లకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపడుతున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో సూచించిన ఖాళీల మేరకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాల్లోనే వెబ్‌ఆప్షన్‌లు నమోదు చేసుకునేలా చర్యలు చేపడుతున్నారు. నూతన టీచర్లు శిక్షణ కేంద్రాల్లోనే వెబ్‌ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. చిత్తూరు విద్యాశాఖలో పనిచేస్తున్న ఏడీ–2తో పాటు మరికొంత సిబ్బంది విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో గత రెండు రోజులుగా వెబ్‌కౌన్సెలింగ్ కసరత్తు చేపడుతున్నారు. బుధవారం వెబ్‌కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. 9, 10 తేదీల్లో వెబ్‌కౌన్సెలింగ్ పూర్తి చేసి ఈ నెల 13న కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా కసరత్తు నిర్వహిస్తున్నారు.

పూడిక తీత.. పాలకులకు మేత!

కూటమి నేతలు అంతా మాయ చేశారు. చిత్తూరు నగరానికే తలమానికమైన కట్టమంచి చెరువును కుళ్లబొచేశారు. పూడిక తీత పేరుతో నాలుగు నెలలపాటు ఇష్టారాజ్యంగా తవ్వేశారు. వందల ట్రిప్పుల మట్టిని ఇష్టారాజ్యంగా విక్రయించి జేబులు నింపుకున్నారు. అధికార మదంతో ఏ ఒక్కర్నీ అటువైపు రానీయకుండా అడ్డుకట్ట వేశారు. తీరా స్థానికులు ఆర్టీఐకి విన్నవించడంతో టీడీపీ నాయకుల బాగోతం బయటపడింది. అసలు ఇరిగేషన్ అనుమతులే లేవని.. నిబంధనలు అస్సలే పాటించలేదని సంబంధిత అధికారులు లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఔరా..! అంటూ పలువురు కూటమి నేతల తీరును ఎండగడుతున్నారు.

- కట్టమంచి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పూడికతీత పనులు
- అడ్డగోలుగా చెరువు మట్టిని అమ్ముకున్న టీడీపీ నాయకులు
- చెరువు అక్రమాలపై ఆర్టీఐకి ఫిర్యాదు చేసిన స్థానికులు
- అనుమతులతోనే పనులు చేశామంటున్న కూటమి నేతలు
- తమ వద్ద అనుమతులే పొందలేదని తేల్చేసిన ఇరిగేషన్ అధికారులు
- బయటపడ్డ కూటమి నేతల బాగోతం

కట్టమంచి చెరువులో అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం (ఫైల్).



అడ్డగోలుగా తవ్వకాలు



కట్టమంచి చెరువులో మట్టి ఎత్తేయడంతో ఏర్పడ్డ గుంతలు

కట్టమంచి చెరువులో ఇరిగేషన్ అధికారుల సూచనలు, స్పష్టమైన అనుమతులతో పూడికతీత పనులు చేపట్టినట్లు గతంలో కూటమి ప్రజాప్రతినిధి వెల్లడించారు. తాజాగా ఇరిగేషన్ అధికారులు వెల్లడించిన సమాచారంతో అంతా అవాక్కయ్యారు. కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని స్పష్టంగా తెలియజేశారు. గత రెండేళ్లుగా తమ శాఖ తరఫున ఎటువంటి తనిఖీలు చేయలేదని ఇరిగేషన్ అధికారులు వివరణ ఇచ్చారు. నెలలతరబడి సాగిన పూడికతీత పనులకు కూడా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తేల్చేశారు. కట్టమంచి సుందరీకరణ పేరుతో టీడీపీ నాయకులు మట్టిని అక్రమంగా తరలించి దోచుకున్నట్టు స్పష్టం చేశారు.

నిజాలు ఇవే

కట్టమంచి చెరువులో మట్టితవ్వకాలకు సంబంధించి చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీఐ ద్వారా సమాచారం రాబట్టారు. అందులో ఆ వ్యక్తి అడిగిన ప్రశ్నలకు ఇరిగేషన్‌శాఖ చిత్తూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ జయచంద్రబాబు లిఖిత పూర్వకంగా కొన్ని విషయాలు వెల్లడించారు. అందులో కొన్ని..!

- కట్టమంచి చెరువు పై గత ఐదేళ్లుగా తమ శాఖ తరఫున ఎలాంటి తనిఖీల నివేదికలు లేవు.
- గత రెండేళ్లుగా కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు.
- కట్టమంచి చెరువుకు సంబంధించి ఇరిగేషన్‌శాఖ తరఫున మట్టి తవ్వకాలపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.
- ఆక్రమణలను తొలగించే అధికారం రెవెన్యూ శాఖకు మాత్రమే ఉంది.
- కట్టమంచి చెరువులో గత రెండేళ్లుగా ఎలాంటి ఆదాయం రాలేదు.
- నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు ఇరిగేషన్ శాఖ ఎవ్వరికీ ఎలాంటి అనుమతులు, ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు.
- కట్టమంచి చెరువులో మట్టి తవ్వకాలపై ఎలాంటి ఫిర్యాదులు అంద లేదు.



కట్టమంచి చెరువులో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఇరిగేషన్ అధికారులు వెల్లడించిన లిఖిత పూర్వకమైన సమాధానం

వీటికి జవాబు ఉందా..?

- కట్టమంచి సుందరీకరణ పనులకు కూటమి నాయకులు అనుమతులు ఎవరి దగ్గర పొందారు..?
- అనుమతులు ఎవరిచ్చారు..? ఎప్పుడిచ్చారు...?
- చెరువులో ఎంత లోతుకు మట్టి తవ్వాలకు అనుమతులిచ్చారు..?
- తవ్విన మట్టిని దేనికి ఉపయోగించారు?



కట్టమంచి చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఎంతో చరిత్ర కలిగిన కట్టమంచి చెరువును టీడీపీ నాయకులు గుల్లచేశారు. అధికారుల అనుమతులతో పూడికతీత పనులు చేపడుతున్నామంటూ యథేచ్ఛగా మట్టి తవ్వకాలకు పూనుకున్నారు. భారీ ప్రొక్లైనర్లు, జేసీబీలు పెట్టి కొన్ని నెలలపాటు కట్టమంచి చెరువులోని మట్టిని తవ్వి తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నారు. అలాగే టీడీపీ ప్రజాప్రతినిధి, ఓ కార్పొరేటర్ వేసిన వెంచర్లకు మట్టిని అక్రమంగా తరలించారు. దీనిపై ఏ ఒక్కరూ నోరుమెదపకుండా జాగ్రత్తపడ్డారు. అధికారులు, స్థానికులు కొందరిని లంచాలతో మేనేజ్ చేసి తమ పనికానిచ్చేశారు.

ఇన్నాళ్లూ కళ్లు మూసుకున్నారా?

కట్టమంచి చెరువులో కొన్ని నెలలపాటు జరిగిన అక్రమ మట్టి తవ్వకాలపై ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. చిత్తూరు నడిబొడ్డున ఉన్న చెరువులో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతుంటే అధికారులకు చీమకుట్టినట్టూ లేదు. కళ్లెదుటే మట్టి తరలిపోతున్నా పట్టించుకోలేదు. ఇటీవల వరుసగా 'సాక్షి'లో కథనాలు వచ్చినా పెద్దగా స్పందించలేదు. అంటే అధికార పార్టీకి అమ్ముడుపోయారా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. లేదా లంచాల మత్తులో కళ్లుమూసుకుని కూర్చున్నారా..? అని నిలదీస్తున్నారు. ఇప్పుడు సాఫీగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడంపై రగిలిపోతున్నారు. అత్యవసరమయ్యి.. ఎవరైనా ఒక లోడ్డు మట్టి ఎత్తితే ఆగమేఘాల మీదొచ్చి అరెస్టులు చేయించే అధికారులు నెలల తరబడి కళ్లెదుటే మట్టి తరలుతున్నా ఎందుకు పట్టించుకోలేదని గళం ఇప్పుతున్నారు. మరి వీటికి సమాధానం ఎవరు చెబుతారో వేచి చూడాలి మరి..!

చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు, పక్కన నారాయణస్వామి

తిరుపతి మంగళం : 'చంద్రబాబుకు దళితులంటే చిన్నచూపు, అందుకే దళితుడిగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని వ్యాఖ్యానించారు. అందుకే అంబేడ్కర్ విగ్రహాలకు నిప్పు పెట్టినా పట్టించుకోరు.. దళితులపై దాడులు జరిగినా స్పందించరు' అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంల దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహ దహనంపై కక్షపూరిత రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. విగ్రహం కాల్చిన దుండగులను వదిలేసి, ఫిర్యాదు చేసిన సర్పంచ్ గోవిందయ్యపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. ఈ విషయంలో చిత్తూరు ఎస్పీ మాట్లాడుతూ అది స్వల్ప విషయమంటూ వ్యాఖ్యానించడం దారుణమన్నారు. పోలీసులు కేవలం పచ్చనేతల మెప్పుకోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. డిజిటల్ బుక్‌లో దళితులకు అన్యాయం చేసిన ప్రతి ఒక్కరి పేర్లను నమోదు చేస్తామని, చట్టపరంగా శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగిన నారాయణస్వామిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపాలని అనేక కుట్రలు చేశారన్నారు. ఇప్పుడు దేవళంపేటలో సర్పంచ్ గోవిందయ్యపై కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేత సతీష్‌నాయుడే అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టించాడని తెలిసినా పచ్చనేతల మెప్పు కోసం చిత్తూరు ఎస్పీ కుట్రపూరితంగా గోవిందయ్య పై కేసులు పెట్టారని విమర్శించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడు తూ గతంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టనీయకుండా టీడీపీ నేత సతీష్ నాయుడు అడ్డుకున్నారన్నారు. ఎమ్మెల్యే థామస్ ఏనాడైనా దళితుల కోసం పోరాటాలు చేశారా? ఎక్కడైనా ఒక్క అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కోసం దళితుడని అని చెప్పుకునే థామస్ తిరుమలకు వెళ్లినప్పుడు క్రిస్టియన్‌గా డిక్లరేషన్ ఇవ్వడంలోనే నిజ స్వరూపం తెలుస్తోందన్నారు. అలాంటి వ్యక్తి తాను రూ. వేల కోట్లు అవినీతి చేశానంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దళితులను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అంటరానివారిగానే చూస్తున్నారన్నారు. ఈ మేరకు దళితులంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్ కుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, నల్లాని బాబు, రామయ్య, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చేజర్ల మురళి పాల్గొన్నారు.

నన్నెవడ్రా ఆపేది?

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. కూటమి పార్టీకి చెందిన ఓ నాయకుడి పేరు చెప్పిన ఆ వ్యక్తి నగరంలో కార్పొరేషన్ అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నాడు. ప్లాన్ లేకపోవడంతో భవన నిర్మాణాన్ని ఆపాలని ఇటీవల అధికారులు సూచించగా.. అధికార పార్టీ నాయకుడు ఫోన్ చేసి వదిలేయమన్నారు. సరేనని అధికారులు వచ్చేశారు. తీరా మూడంతస్తుల భవనం నిర్మిస్తుండడంతో కార్పొరేషన్ అధికారులు పనులను ఆపి, నోటీసులు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇంతలో కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన ఆ వ్యక్తి పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులపై నోరు పారేసుకున్నాడు. 'నేను రూలింగ్ పార్టీ వ్యక్తిని. అన్నకు ప్రధాన శిష్యుడిని.. ప్లాన్ లేదు, అయితే ఎవడ్రా ఆపేది..?' అంటూ ఏకవచనంతో అధికారులను తూర్పారబట్టాడు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు తీవ్రంగా స్పందించడంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎంత అధికార పార్టీకి చెందిన వ్యక్తులైనా.. ప్రభుత్వ కార్యాలయంలోకి చొరబడి ఇలా అధికారులనే బెదిరింపులకు గురిచేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

మోకాళ్లపై నిరసన



కళ్లకు గంతలు కట్టి, మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఏపీపీహెచ్‌సీడీఏ సంఘం పిలుపు మేరకు జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు సమ్మెను కొనసాగిస్తున్నారు. మంగళవారం కూడా విధులను బహిష్కరించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కళ్లకు నల్ల రిబ్బన్ ధరించి.. మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సంఘ నాయకులు ఎల్లయ్య, శిరీష మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె ఆగదన్నారు. టైమ్ బౌండ్ ప్రమోషన్లు, ఇన్ సర్వీస్ పీజీ కోటా విషయంలో తగ్గేదేలేదన్నారు.

పీహెచ్‌సీలు వెలవెల

సమ్మె కారణంగా పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. వైద్యులు సమ్మె బాట పట్టారని తెలిసి పల్లెల్లోని జనం పట్టణ బాట పడుతున్నారు. కేవలం మందులు, మాత్రల కోసమే పీహెచ్‌సీలకు వస్తున్నారు. చికిత్స కోసం ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పీహెసీల్లో ఓపీ సేవలు పూర్తిగా స్తంభించాయి. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు మూలనపడ్డాయి. ఆన్‌లైన్ సేవలు ఆమడ దూరంలో పడిపోయాయి. పల్లెల్లో విష జ్వరాలు కోరలు చాస్తున్నాయి. సమ్మె మరిన్ని రోజులు కొనసాగితే పరిస్థితులు చేయిదాటిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గుడి ఎనక నా సామి!



చెప్పేది శ్రీరంగనీతులు.. చేసేది మాత్రం..!

- ప్రచార యావ కోసం రెచ్చిపోతున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు
- నిత్యం దేవుడికి రాజకీయ రంగు పులమడమే ఆయన పని
- విస్తుపోతున్న భక్తులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గురివిందకు కింద నలుపు తెలియదు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు ఓ పాలక మండలి సభ్యుడు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదని అంటూనే ప్రతిదీ రాజకీయం చేస్తున్నాడు. దేవుడి సన్నిధిలో గోవిందా...! నారాయణ..! అంటూనే ఇతరులపై విషం చిమ్ముతున్నాడు. ఆఖరుకి రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన పరివట్టం వ్యవహా రం కూడా ఆయన తన రాజకీయ వేదిక కింద మలిచేశారు. టీటీడీలో ఏ వివాదం తలెత్తినా తగుతునమ్మా అంటూ వకల్తా పుచ్చుకుంటున్నాడు. పోనీ వాస్తవాలు చెబుతాడా..! అంటే అదీ లేదు. అన్నీ అసత్యాలే. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. వారికి సంబంధించిన అంశాలు అయితే మాత్రం తిరుమలను వేదికగా చేసుకొని ప్రసంగాలు దంచేస్తాడు. ఇక రోజు మార్చి రోజు దర్శనానికి వచ్చే ఆయన అయితే.. టీటీడీ చైర్మన్ ప్రాపకం కోసం ఆయన చానల్లో కనిపించడం కోసం తెగ ఆరాటపడిపోతున్నాడు. అసత్యాలను వల్లివేస్తున్నాడు.

- పరివట్టం కట్టడం విషయంలో గతంలో ఏమైనా జరిగాయో లేదో పక్కన పెడితే ఇలా చేయడం బహిరంగంగా తప్పని పండితులు చెప్పున్నారు.
- అయితే సదరు సభ్యుడు పబ్లిసిటీ పిచ్చి కోసం టీటీడీని అడ్డంగా వాడుకుంటున్నాడు. టీటీడీలో అనేక మంది పాలకమండలి సభ్యులు ఉన్నా.. ఎవరూ తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయరు. కానీ సదరు సభ్యుడు మాత్రం శ్రీవారి ఆలయం ముందు నిత్యం రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేయడం పరిపాటిగా మారిపోయింది. 2019 క్రితం పాలకమండలి సమావేశంలో అయితే ఏకంగా చైర్మన్ కార్యాలయంలోనే సమావేశం నిర్వహించి.. రాజకీయ ఆరోపణలు చేశారు. ఆయన తీరుపై భక్తులు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.
- హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిసి కూడా ఇలా మాట్లాడడంపై పలువురు భక్తులు రగిలిపోతున్నారు.

క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో చోరీ



ద్వారానికి ఉన్న గొళ్ళాన్ని విరిచిన దొంగలు

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె శివార్లలో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారానికి ఉన్న తాళం పగలగొట్టి ఆలయంలో ప్రవేశించారు. ఆలయంలో ఉన్న బీరువాను చిందర వందర చేశారు. హుండీలో ఉన్న కొంత నగదును ఎత్తుకెళ్లారు. కాగా దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జిల్లా నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలో మంగళవారం జిల్లా నాయీబ్రహ్మణ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిట్టిబాబు, వెంకటేష్, అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మురళి, లక్ష్మీకాంత్, కార్యదర్శులుగా ధనశేకర్, శివ, కోశాధికారిగా వాసు కిరన్, మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా కార్తీక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రచార కార్యదర్శులు, సభ్యులను నియమించుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీలో కార్తీక్‌కు చోటు



కార్తీక్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారి, ఉపాధ్యాయుడు కార్తీక్‌కు రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీలో చోటు లభించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్‌సీసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఏటా ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌కి ఎన్‌సీసీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఆయన ఎంపికయ్యారు. ఆయన ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రీ ఆర్‌డీసీ క్యాంప్‌లో పాల్గొంటారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున ఆయన ఎంపిక కావడంపై హెచ్‌ఎం హసన్‌బాషా, తోటి ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

విచ్చలవిడిగా స్పిరిట్!

- డీజిల్, పెట్రోల్ ట్యాంకర్లలో తరలుతున్న వైనం
- మహారాష్ట్ర, గోవాల నుంచి ఏపీలోకి
- గతంలోనూ స్పిరిట్ లారీలను పట్టుకున్న పోలీసులు
- ములకలచెరువు ఘటనతో మరిన్ని అనుమానాలు



గతంలో పలమనేరులో పట్టుబడిన స్పిరిట్ లారీ

పలమనేరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు ఏపీలోకి విచ్చలవిడిగా స్పిరిట్ దొడ్డిదారిన వస్తోంది. ములకల చెరువుతోపాటు రాష్ట్రంలోని పలుచోట్ల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం ఏరులై పారుతోంది. ఈ మద్యం తయారీకి అసలైన ముడి సరుకు ఆర్ఎస్(రెక్టిఫైడ్ స్పిరిట్). గతంలో మన రాష్ట్రంలోకి మహారాష్ట్ర, గోవాల నుంచి కర్ణాటక మీదుగా వచ్చేది. ఎవరికీ అనుమానం రాకుండా ఆర్ఎస్‌ను ఆయిల్ ట్యాంకర్లలో స్మగ్లింగ్ చేసేవారు. అప్పట్లో పలమనేరు పోలీసులు సైతం డీజిల్ ట్యాంకర్‌లో ఆయిల్ బిల్లుతో వస్తున్న స్పిరిట్ ట్యాంకర్‌ను పట్టుకున్న విషయం తెలిసిందే. గతంలో గంగవరం మండలంలోని ఓ కోళ్ల ఫామ్‌లో నకిలీ మద్యం గుట్టురట్టయ్యింది. తయారీ పరికరాలు బెంగళూరు, నరసాపురం నుంచి వస్తుంగా.. స్పిరిట్ మాత్రం మహారాష్ట్ర నుంచి తమకు అందుతోందని పట్టుబడిన వ్యక్తులు ఎక్సైజ్ పోలీసులకు చెప్పారు. తాజాగా ములకలచెరువుతోపాటు విజయవాడ ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారవతున్నందున స్పిరిట్ అక్రమ రవాణా మళ్లీ సాగుతోందని తెలుస్తోంది.

ఇదో పెద్ద నెట్‌వర్క్

స్పిరిట్‌తో బయల్దేరిన ట్యాంకర్ గమ్యం చేరేదాకా ఓ రహస్య నెట్‌వర్క్ బలంగా పనిచేస్తోంది. ఒక్కో ట్యాంకర్‌కు నలుగురికి పైగా డ్రైవర్లు ఉంటున్నారు. ఈ వాహనానికి ముందు రోడ్డు క్లియరెన్స్ కోసం మరి కొందరు ఇతర వాహనాలతో ఎస్కార్ట్‌గా వెళ్తుంటారు. వీరికి అండగా సంబంధిత ప్రాంతాల్లోని స్థానికులు, ఎక్సైజ్, మార్కెటింగ్, రవాణాశాఖలోని కొందరి అండదండలున్నట్టు సమాచారం. వీరందరూ మొత్తం అక్రమరవాణాను చిన్న మొబైల్ ఫోన్ల ద్వారానే సాగిస్తారు.

రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోనే..

గతంలో నకిలీ మద్యం తయారీ జరిగింది కూడా కర్ణాటక, ఏపీ రాష్ట్ర సరిహద్దుల్లోనే. ఇప్పుడు కూడా ములకలచెరువు కర్ణాటక రాష్ట్రానికి దగ్గర్లోనే ఉంటుంది. ఎందుకంటే తయారీకి అవసరమైన వస్తువులు చేరవేసేందుకు బోర్డర్లే సేఫ్టీగా వీరు భావిస్తుంటారు. ఏదేమైనా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పిరిట్ అక్రమరవాణాపై నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏమాత్రం అనుమానం రాకుండా..

మహారాష్ట్ర నుంచి కర్ణాటక మీదుగా చెన్నై- బెంగళూరు హైవేలో పలమనేరు మీదుగా, బెంగళూరు నుంచి మదనపల్లి మీదుగా ఆయిల్ ట్యాంకర్లు ఎక్కువగా ఏపీతోపాటు తెలంగాణకు వెళుతుంటాయి. ఇందులో అనుమానం రాకుండా రసాయనాల పేరుతో బిల్లులు వేసుకొని ఆయిల్ ట్యాంకర్లలో ఈ స్పిరిట్‌ను తరలించేస్తున్నట్టు తెలిసింది. కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల్లో స్మగ్లర్లకు ఎలాంటి ఇబ్బందీ లేదు. ఇక ఇక్కడి సరిహద్దులోని తనిఖీ కేంద్రాలను గతంలో తొలగించడంతో ఇక అక్రమరవాణాకు అడ్డేలేకుండా పోయింది. ట్యాంకర్‌లో మూడు కంపార్ట్‌మెంట్లు ఉండగా మధ్య కంపార్ట్‌మెంట్‌లో స్పిరిట్‌ను నింపుకొని మరో రెండు కంపార్ట్‌మెంట్లకు ఆయిల్‌ను నింపుకొని తరలిస్తున్న విషయం గతంలో బయటపడింది. సరిహద్దు ప్రాంతాలకు మాత్రం రికార్డులు లేని దొంగ కార్లకు వేరే నంబరు ప్లేట్‌తో సైతం వీటిని తరలిస్తున్నారు. ముఖ్యంగా గోవా, ముంబై, బీదరు నుంచి ఈ స్పిరిట్ ఇటు కర్ణాటకలోని బెంగళూరు, కోలారు, ముళబాగళ్‌ల మీదుగా పలమనేరుకు.. అదే విధంగా కర్ణాటక నుంచి అనంతపురం జిల్లా మీదుగా మదనపల్లె దాటి పలమనేరు మీదుగా ఏపీ, తెలంగాణలోకి చేరుతోందని తెలుస్తోంది.

రేపటి నుంచి బ్యాంక్ సేవలు బంద్

గుడిపాల: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌ల విలీనంలో భాగంగా 9వ తేదీ సాయంత్రం 6 నుంచి 13వ తేదీ ఉదయం 10 గంటల వరకు బ్యాంక్ సేవలు పనిచేయవని మేనేజర్ నాగరాజు తెలిపారు. గతంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌గా ఉండి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడడంతో కొన్ని ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు, అన్నీ ఆన్‌లైన్ లావాదేవీలు అందుబాటులో ఉండవని, ఖాతాదారులు ఈ విషయాలు గమనించాలని ఆయన సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

శాంతిపురం: పశువులకు గడ్డి కత్తిరించే మిషన్ ఆన్ చేసే ప్రయత్నంలో మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కెనమాకులపల్లిలో ఓ రైతు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేష్ (54) వ్యవసాయం, పశుపోషణ, తీరిక సమయంలో బట్టలు ఇస్త్రీ చేసుకుని జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి పశువులకు గడ్డి కత్తిరించే మిషన్‌ను ఆన్ చేసే ప్రయత్నంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకటేష్ మార్గమధ్యంలో తుది శ్వాస విడిచాడు.

ఎస్వీయూలో 10న జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో ఈనెల 10న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు.

కోడికి కార్పొరేట్ అంతంతే!

- జిల్లాలో జోరుగా కోళ్ల పెంపకం
- పెంపకందార్లను ముంచేస్తున్న కార్పొరేట్ కంపెనీలు
- కేజీకి రూ.4.50 నుంచి రూ.6.50 చెల్లిస్తున్న వైనం



కాణిపాకం: కార్పొరేట్ సంస్థల కారణంగా కోళ్ల పెంపకందారులు నష్టాల్లో మునిగిపోతున్నారు. కష్టపడి కోళ్లను పెంచితే కేజీకి రూ.4.50 నుంచి రూ.6.50 మాత్రమే చెల్లిస్తున్నారు. ఫలితంగా ఫౌల్ట్రీ రైతులు ఫల్టీ కొడుతున్నారు. ఆర్థికంగా చితికిపోతున్నారు. దీంతో వారు రోడెక్కి.. గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌ను లేవనెత్తారు.

కోళ్ల పెంపకం ఇలా...

జిల్లాలో లింగాపురం, నాటుకోళ్లు, లేయర్స్, బ్రాయిలర్స్ పెంపకం జరుగుతోంది. లింగాపురం, లేయర్స్, నాటుకోళ్ల పక్కన పెడితే బ్రాయిలర్స్ కోళ్ల పెంపకంపై వెయ్యి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ఇంటిల్లిపాదీ ఈ పెంపకంలో నిమగ్నమైపోతున్నారు. వీరి వద్ద సుమారుగా 7 లక్షల నుంచి 10 లక్షల కోళ్లు పెరుగుతున్నాయి. కొన్నేళ్ల కిందట హెచరీస్ ద్వారా ఫౌల్ట్రీ రైతులు కోడి పిల్లలను తెచ్చుకుని పెంచేవారు. ఇప్పుడు కార్పొరేట్ సంస్థలే పిల్లలను ఇచ్చి.. ఫీడు, మెడిసిన్ ఇస్తున్నాయి. ఫౌల్ట్రీ రైతులు వాటిని 40 రోజుల పాటు పెంచితే... కిలోకి రూ.4.50 నుంచి రూ.6.50 వరకు ఇస్తున్నాయి. ఈ మొత్తం గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

అదనపు భారం

కోళ్ల పెంపకందారులు 10వేల కోళ్లను 40 రోజుల పాటు పెంచి పోషించాలంటే కార్పొరేట్ సంస్థలు ఇచ్చే ఫీడ్, మెడిసిన్ సరిపోవడం లేదని రైతుల వాదన. ఈ కారణంగా ఫౌల్ట్రీ రైతులపై అదనపు భారం పడుతోంది. తొలుత పిల్లలను ఉష్ణోగ్రతలో పెట్టేందుకు బొగ్గు 25 బ్యాగు(25కేజీ)లు అవసరమవుతోంది. ఒక బ్యాగును రూ.500 చొప్పున్న కొనుగోలు చేస్తున్నారు. మెడిసిన్ ఖర్చులు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అవుతోంది. కరెంటు బిల్లు 40 రోజులకు గాను రూ.7 వేల నుంచి రూ.9వేల వరకు వస్తోంది. వరిపొట్టు సైతం డబ్బులిచ్చి కొనుగోలు చేయాల్సి వస్తోందని పెంపకందారులు వాపోతున్నారు.

ఏదీ లాభం

పెంపకందారులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. కోడి పిల్లలను దింపే సమయంలో చెప్పే ధరకు, కోడి బలిసిన తర్వాత ఇచ్చే ధరకు పొంతన ఉండడం లేదని పెంపకందారులు వాపోతున్నారు. కేజీకి రూ.4.50 నుంచి రూ.6.50 వరకు ఇస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు చనిపోయిన కోళ్లు, కాళ్ల దెబ్బ తిన్న కోళ్లను తమపైపే నెట్టేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇదేమని అడిగితే ఎఫ్‌సీఆర్, సీఎఫ్‌సీఆర్ పేరుతో బెదిరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కేజీకి రూ.9 ఇవ్వాలని రోడెక్కుతున్నారు.

గిట్టుబాటు ధర రూ.9 ఇవ్వాలి



కోళ్లు పెంచి పోషిస్తే కార్పొరేట్ సంస్థలు కేజీకి రూ.4.50 నుంచి రూ.6.50 వరకు ఇస్తున్నాయి. ఫీడ్, చిక్స్ క్వాలిటీ తక్కువగా ఇస్తున్నారు. దీనివల్ల పెంపకందారులు చాలా నష్టపోతున్నాం. కష్టానికి తగ్గట్టు ప్రతిఫలం ఉండడంలేదు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో మాదిరిగా కేజీకి రూ.9 ఇవ్వాలి. ఆరకంగా అధికారులు చొరవ చూపాలి. మాజీవనోపాధిని కాపాడాలి.

– విశ్వనాథరెడ్డి, గంగాధరనెల్లూరు

ఖర్చు పెరిగింది



ఫౌల్ట్రీ రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఇటీవల ఉత్పత్తి వ్యయాలు బాగా పెరిగాయి. కరెంటు బిల్లులు, వరిపొట్టు, బొగ్గు, మందుల ధరలు భారంగా మారాయి. కంపెనీ చెప్పిన విధంగా నిబంధనలు పాటించినా గిట్టుబాటు కలగడం లేదు. బ్యాంకు రుణాలు తీర్చలేకపోతున్నాం. అప్పుల పాలవుతున్నాం. అధికారులు స్పందించాలి. మాకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– కేశవులురెడ్డి, చెన్నారెడ్డిపల్లి, గంగాధరనెల్లూరు

అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మందులు, మాత్రల జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఏ మాత్రం తగ్గలేదు' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై స్పందించిన ఆమె చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆ శాఖ అధికారులు, వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్, జిల్లా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల్లో మందులు, మాత్రల జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. ర్యాలీలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, అధికారులు ప్రవీణ, అనూష, వేణుగోపాల్, శ్రీవాణి, రామ్మోహన్ పాల్గొన్నారు.

వాల్మీకి సేవలు మరువలేనివి



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : వాల్మీకి మహర్షి సేవలు మరువలేనివని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. వాల్మీకి జయంతి ని పురస్కరించుకుని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో వేడుకలు నిర్వహించారు. పాల్గొన్న కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మేయర్ అముద, బీసీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిబాషా, సూపరింటెండెంట్ శ్రీను పాల్గొన్నారు.

సావిత్రమ్మ కళాశాలలో..

నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.ఉషారాణి పాల్గొని ప్రసంగించారు. అధ్యాపకులు షమ్స్ అక్తర్ పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు ఎంపిక



రేష్మాను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వడమాలపేట (పుత్తూరు): ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో అండర్-14 బాల బాలికలకు తైక్వాండో ఎంపిక పోటీలు సోమవారం చిత్తూరులో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని రేష్మా తైక్వాండో 20 కిలోల విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బాపట్ల జిల్లా, రేపల్లెలో జరుగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో చిత్తూరు జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రేష్మాను హెచ్‌ఎం కరుణా నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను చూపుతున్నఅధికారులు

ఐరాల: అక్రమంగా తరలిస్తున్న 13 ఎర్రచందనం దుంగలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్వీ సుబ్బరాయుడు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి కథనం మేరకు.. సోమవారం తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ అధికారికి పులిచెర్ల సమీపంలో కొంతమంది ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రాత్రి 10 గంటల సమయంలో పులిచెర్ల క్రాస్ సమీపంలో అటవీశాఖ అధికారులు నిఘా ఉంచారు. ఇన్నోవా కారు వేగంగా వచ్చింది. పసిగట్టి ఐరాల మార్గంలోకి వెళ్లగా పోలీసులు వెంబడించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మండలంలోని గుడిపల్లె సమీపంలోని మామిడి తోట పక్కన ఇన్నోవా కారుతో పాటు 439.100 కిలోల బరువున్న 13 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పుల్లిచెర్ల నుంచి సుమారు 30 కి.మీ దూరం వరకు వాహనాన్ని వెంబడించి పట్టుకున్నామన్నారు. నిందితుడు కారు వదిలి పరారయ్యాడని తెలిపారు. వాటి విలువ రూ.18,64,857 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలో సెక్షన్ అధికారి శశికుమార్, బీట్ అధికారులు చంద్రబాబు, ప్రసాద్‌కుమార్, వాచర్లు భార్గవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

15న 'మామిడి' ఆక్రందన సభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి రైతుల ఆక్రందన సభ ఈ నెల15న నిర్వహించనున్నట్టు మామిడి రైతు సంఘ నేతలు తెలిపారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో ఉదయం 10గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. తోతాపురికి రూ.12 గిట్టుబాటు ధర కల్పించాలనే నినాదంతో ఈ సభ జరుగుతుందని, జిల్లా లోని రైతులు హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి వర్క్‌షాప్

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని తాజ్‌హోటల్‌లో బుధవారం నుంచి రెండు రోజులపాటు జాతీయ సహకార మంత్రిత్వశాఖ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సహకారం రంగం బలోపేతం, వివిధ పథకాల అమలుపై సమీక్షించేందుకు త్రైమాసిక సమావేశం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ సహకార మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆశిష్ కుమార్ భుటానీ, ఏపీ చీఫ్ సెక్రటరీ కె.వి జయానంద్, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్ పాల్గొననున్నట్లు వివరించారు.

పరిసరాల శుభ్రత పై అవగాహన

- ఎంపీడీవోలు, కమిషనర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- మూడో విడత రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
- వరుస సమావేశాల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు పారిశుద్ధ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీలపై ఆధారపడకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసే వర్షాలకు ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

జిల్లా వ్యాప్తంగా 3వ విడత రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, సర్వేశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించడంలో మండల సర్వేయర్, వీఆర్‌వోలు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. రీ సర్వేలో అందే అర్జీలకు పది రోజుల్లోపు పరిష్కారం చూపాలన్నారు. జేసీ విద్యాధరి మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 31 గ్రామాల్లో 30,774 ఎకరాల భూమిని రీ సర్వే చేశారన్నారు. రెండో విడతలో 38 గ్రామాల్లో 40,359 ఎకరాల్లో, మూడో విడతలో 12 గ్రామాల్లో 3,859 ఎకరాల భూమిని రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ రీ సర్వే వచ్చే ఏడాది మార్చి 31 వరకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రేపటి నుంచి జిల్లాలోని 12 గ్రామాల్లో మూడో విడత రీ సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, సర్వే శాఖ డీడీ జయరాజ్, ఏడీ శాంతిరాజ్, తహసీల్దార్లు, సర్వేయర్‌లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

పుత్తూరు: స్థానిక బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు.. బైపాస్ రోడ్డులోని ప్రైవేట్ హోటల్‌లో నగరి మండలం, చింతలపట్టెడ గ్రామానికి చెందిన డి.కె.రామస్వామి(65) సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. రామస్వామి రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపు వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడ్డ రామస్వామిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయం పక్కనే జీవశ్చవంలా..



సచివాలయం సమీపం వద్ద పడివున్న వ్యక్తి

నగరి : పట్టణ పరిధి కీళంమిట్ట సచివాలయ సమీపంలో నాలుగు రోజులుగా ఒక గుర్తు తెలియని వ్యక్తి నీరు, ఆహారం లేకుండా నిర్జీవ స్థితిలో పడి ఉన్నాడు. ఆ దారిన వెళ్లేవారు గానీ, సచివాలయానికి వచ్చి వెళ్లేవారుగానీ, సిబ్బంది గానీ చూస్తూ వెళుతున్నారు తప్ప.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఆ వ్యక్తి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడన్నది తెలియరాలేదు. ఎండకు, వానకు ఎలాంటి చలనం లేకుండా అక్కడే పడివున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఇన్ని రోజులు ఆ ప్రాంతంలో జీవశ్చవంలా పడి ఉన్నా అధికారులు ఎవ్వరూ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రాణం తప్ప చలనం లేని ఇతని పరిస్థితిని ఆరా తీయాలనిని స్థానికులు కోరుతున్నారు.